కాశీబుగ్గ డీఎస్పీగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పలాస: కాశీబుగ్గ డీఎస్పీగా పి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అమరావతి పోలీసు కేంద్ర కార్యాలయంలో విధులు నిర్వహిస్తు బదిలీపై వచ్చారు. ఆయన గతంలో మందస, కాశీబుగ్గ ఎస్ఐ, సిఐగా కూడా పనిచేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యం ఇస్తామని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావుకు డివిజన్ కు చెందిన సిఐలు ఎస్ఐలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నౌపడలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర-సంతబొమ్మాలి : ఈ మండలం నౌపడ శ్రీ నారాయణ కమలం శ్రీయోనిధి ఆధ్వర్యంలో, సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం రామాలయం వద్ద నిర్వహించారు. నౌపడతోపాటు పరిసర గ్రామాలకు చెందిన 119 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ క చెందిన వైద్య సిబ్బందితోపాటు, నౌపడ ప్రభుత్వ వైద్య ఆరోగ్య డాక్టర్లు పరిమళ, నందిని, శివ ఉచితంగా కంటి తనిఖీలను చేసి, శస్త్ర చికిత్సలకు ఎంపికైన 35 మంది రోగులను ఆ సంస్థ ప్రతినిధులు ఉచితంగా బస్సును ఏర్పాటు చేసి, ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించేందుకు శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమం నౌపడ నారాయణ కమలం శ్రేయోనిధి ప్రతినిధులు, విజయానందరాజా, వైకుంటరావు, జైకృష్ణారెడ్డి అధ్వర్యంలో జరిగింది.

శ్రీముఖలింగేశ్వరుని దర్శించిన శివ స్వాములు

విశాలాంధ్ర-జలుమూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం జలుమూరు మండలం శ్రీముఖలింగం లో కొలువైయున్న శ్రీమధ్వేశ్వర స్వామిని ఒడిస్సా రాష్ట్రం రాయగడ పర్లాకిమిడి పలు ప్రాంతాల నుండి శ్రావణమాసం సోమవారం ఉదయం పలువురు శివ స్వాములు స్వామిని దర్శించి పూజలు నిర్వహించారు. వంశధార నదిలో సాన్నం చేసి నది ఒడ్డున ఇసుకతో తయారు చేసిన శివలింగం చేసి వాటికి నదీ జలాలతో పూజలు నిర్వహించారు. నది జలాలను చెంబులో నింపి భుజంపై కావిడి వేసుకొని అక్కడ నుండి టెక్కలి సమీపంలో గల రావివలస మల్లికార్జున స్వామిని దర్శించి తిరుగు ప్రయాణం సాగిస్తామని తెలిపారు.

డొక్కా సీతమ్మ జీవితం ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి : ఎమ్మెల్యే నడుకుదిటి

విశాలాంధ్ర-రణస్థలం: డొక్క సీతమ్మ జీవితం ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. రణస్థలం మండల కేంద్రంలో జనసేన నాయకుడు గొర్లె సూర్య నడుపుతున్న డొక్కా సీతమ్మ అన్నదానము కేంద్రములో జనసేన ఎచ్చెర్ల నియోజకవర్గం ఇన్‌చార్జ్ విశ్వక్సేన్ తో కలిసి భోజనం వడ్డించారు. ఆ మహాతల్లి ఎంతోమందికి అన్నదానం చేసారని వివరించారు. ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సూర్యను అభినందించారు. ఈ కార్యక్రమములో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలంలోని కరగాం రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ సీజన్ 2024-25సంవత్సరానికి గాను రైతులు తమ పంట నమోదు చేసుకోవాలని కరగాం రైతు సేవా కేంద్రం, అగ్రికల్చర్ అసిస్టెంట్, చందన తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, ఉచిత పంట భీమా మొదలగు వాటిలో ఈ-పంట ముఖ్యం కాబట్టి, రైతు సోదరులు వారి యొక్క ఆధార్ కార్డ్ జిరాక్స్, లేటెస్ట్ 1-బి జిరాక్స్, రైతు ఫోన్ నెంబర్, కౌలు రైతులకు గాను వ్యవసాయ భూమి యజమాని 1-బి జిరాక్స్, ఓనర్ యొక్క ఒప్పందం, ఫోన్ ద్వారా కన్ఫర్మేషన్, కౌలు కార్డు తీసుకువచ్చి, నమోదు చేసుకోవాలని కోరారు.

ఐతం ప్రొఫెసర్ కు డాక్టరేట్

డాక్టరేట్ అందుకున్న జయలక్ష్మి

విశాలాంధ్ర-టెక్కలి: ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న జయలక్ష్మి అనే ప్రొఫెసర్ కు జెఎన్ టియు కాకినాడ ఇన్స్టిట్యూట్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ లో పీహెచ్డీ డిగ్రీని మంజూరు చేసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఐటమ్ ప్రొఫెసర్ డాక్టర్ జి సతీష్ కుమార్, జేఎన్టీయూ కాకినాడ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ మధు ల మార్గదర్శకత్వంలో మెటహరిస్టిక్ ఫ్రాక్షనల్ కాల్కులస్ అప్టమైజేషన్ బెస్ట్ డీప్ లెర్నింగ్ అల్గిరిథం ఆర్టి ఫ్లెక్సీ రిమూవల్ ఫ్రమ్ ఈఈజి సిగ్నల్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు జేఎన్టీయూ కాకినాడ పీహెచ్డీ డిగ్రీని ప్రధానం చేసిందని డైరెక్టర్ పేర్కొన్నారు. ఐటెం సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జయలక్ష్మి పీహెచ్డీ డిగ్రీని సాధించడంపై డాక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరరావు తోపాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎన్ శ్రీనివాసరావు, హెచ్ ఓ డి డాక్టర్ వి అశోక్ కుమార్, ఆరెండ్ డీన్ డాక్టర్ ఆర్ శ్రీరాములు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

చెత్తాచెదారంతో ఆరోగ్యానికి హానికరం

- ప్రిన్సిపాల్ పేడాడ

విశాలాంధ్ర-కవిటి: మనం నివసించే పరిసర ప్రాంతాలులో చెత్తాచెదారం పేరుకుపోవడంతో నివసించే ప్రజలు అనారోగ్యానికి గురవుతారని ప్రిన్సిపల్ పేడాడ రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని, ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకోవచ్చని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని అన్నారు. చదువుతో పాటు పరిసరాలు,పర్యావరణం పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండడం తప్పనిసరని తెలిపారు.ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా పేరుకు పోయిన పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తా చెదారం తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమం లో ఎన్.ఎస్.ఎన్. పి.ఒ జె.పాపారావు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: పెయ్యిలవాని చెరువులో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని ఎచ్చెర్ల మండలం, ఫరీదుపేట కు చెందిన జి. ఉమామహేశ్వరరావు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. ఎచ్చెర్ల మండలం దుప్పలవలస రెవెన్యూ గ్రామం నందు సర్వే నెం. 97/9,10,11, నందు దుంగ సుదర్శనరావు, సరస్వతి అను వ్యక్తులు నిర్మాణాలకై సుడా వారికి దరఖాస్తు చేశారని, కానీ ఆస్థలం ఆర్వీఎం ప్రాప్తికి చెరువుగా ఉన్నదని అన్నారు. ఆ వ్యక్తులు రెవెన్యూ డిపార్ట్ మెంటు వారిని మేనేజ్ చేసి అడంగల్, 1బి చేయించుకొన్నారని చెప్పారు. సర్వే నెం. 97/9లో డి. పట్టా మెట్టు భూమి అని, సర్వే నెం. 97/10,11 నందు పట్టా భూమి గాను ఆడంగల్ నందు నమోదు కాబడిందన్నారు. కాని ఆర్వీఎం ప్రాప్తికి సర్వే నెం. 97 మొత్తం పెయ్యిలవాని చెరువుగా ఉన్నదని చెప్పారు. కావున సుడా వారు పరిశీలించి అనుమతులను నిరాకరించాలని ఫిర్యాదులో కోరారు.

తోటపల్లి, నారాయణపురంలకు సాగునీరు విడుదల

ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: నారాయణపురం, తోటపల్లి కుడి కాలువ ద్వారా పంట భూములకు ఈ నెల 6న సాగునీరు విడుదల చేయనున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని పెదపాడు రోడ్డులో ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. గత ప్రభుత్వం నారాయణపురం, తోటపల్లి కాలువలకు సకాలంలో నీరు విడుదల చేయకపోవడంతో వేలాది మంది రైతులు తీవ్ర అవస్థలు పడ్డారని తెలిపారు. పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నా పట్టించుకోలేదని, పంటలకు నీరులేక.. ఏంచేయాలో తోచక దూర ప్రాంతాల నుంచి ఇంజన్లు పెట్టి అవస్థలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు అందక ఇబ్బందులు పడిన అన్నదాతల ప్రయోజనమే లక్ష్యంగా శివారు భూములకు సైతం నారాయణపురం, తోటపల్లి కాలువల ద్వారా సాగునీరందించి రైతులు అవస్థలు తీరుస్తామన్నారు. ఇప్పటికే తోటపల్లి రిజర్వాయర్ నుండి సాగునీరు విడుదలకు చర్యలు తీసుకు న్నామని వివరించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చె న్నాయుడు శ్రీకాకుళం నియోజక వర్గ రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అనేక చర్యలు చేపడు తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే నారాయణపురం, తోటపల్లి సాగునీరు విడుదలకు సంబంధిత అధికారులతో మాట్లాడటం జరిగిందని ఎమ్మెల్యే గుండు శంకర్ తెలిపారు. ఈ మేరకు జలవనరుల శాఖ నార్త్‌కోస్ట్ సీఈతో మాట్లాడామని మంగళవారం నాటికి సాగునీటి విడుదలకు నార్త్ కోస్ట్ సీఈ అంగీకరించారని తెలిపారు. రైతాంగం సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో మెరిసిన జిల్లా క్రీడాకారులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: అనంతపురం జిల్లా తాడిపత్రి వేదికగా ఈ నెల 2, 3, 4వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభను కనబర్చి విజేతలుగా నిలిచారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు, నాలుగు కాంస్య పతకాలు సాధించారు. పసిడి పతకాలు సాధించిన కారి మోక్షిత్, పెద్దిన యశితలు జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు అర్హత సాధించినట్లు న్యూ తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం ప్రధానకార్యదర్శి కొమర భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కోచ్ మేనేజర్లు బి. ధనుంజయరావు, నీరజలను ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పెంకి సుందరరావు, ప్రధానకార్యదర్శి ఎం. సాంబమూర్తి, డీఎస్ఓవో కె.శ్రీధర్రావు, సెక్రటరీ బి. వి. రమణ, వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎం. వి. రమణ తదితరులు అభినందించారు.

విజేతలు వీరే... సబ్ జూనియర్ బాలుర అండర్-21 కేజీల విభాగంలో పెద్దిన గగన్ రజతం, అండర్ 27 కేజీల విభాగంలో కారే సాక్షత్ కాంస్యం..బాలికల అండర్ 16కేజీల విభాగంలో శిమ్మ జోషిత రజతం, అండర్ 18కేజీల విభాగంలో ఆరంగి లహరి, అండర్ 20కేజీల విభాగంలో దువ్వ త్రివేని, అండర్ 35 కేజీల విభాగంలో గొండు మోక్షాన్వితలు చెరో ఒక కాంస్య పతకం సాధించారు. క్యాడిట్ బాలుర విభాగంలో అండర్ 37 కేజీల విభాగంలో కారి మోక్షిత్ స్వర్ణం, అండర్ 32 కేజీల విభాగంలో దువ్వ లీలామాధవ్, అండర్ 41 కేజీల విభాగంలో పల్లి సాయికృష్ణ రజత పతకాలు సొంతం చేసుకున్నారు. బాలికల అండర్ 29కేజీల విభాగంలో పెదిదన యశిత పసిడి పతకం సాధించింది.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన అన్ని రకాల పోషక విలువలు తల్లిపాలలో ఉంటాయని, తల్లి బిడ్డకు జన్మనిచ్చిన తరువాత గంటలోపే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలని ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి తెలిపారు. నగరంలోని గుజరాతీపేట సెక్టార్ 32వ వార్డు హయాతినగరం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి స్థానిక వార్డు ఇన్‌చార్జ్ తోనంగి వెంకన్నయాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి మాట్లాడుతూ మాట్లాడుతూ బిడ్డకు పాలివ్వడం వలన తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అదేవిధంగా తల్లికి రొమ్ము క్యాన్సర్ లాంటివి రావని ఆమె సూచించారు. శిశువుకు మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలే ఆహారంగా అందించాలని, ఎటువంటి ద్రవ పదార్థాలు అందించవద్దని సూచించారు. వెంకన్నయాదవ్ మాట్లాడుతూ చిన్నారుల్లో తల్లిపాలతోనే వ్యాధి నిరోధకశక్తి లభిస్తుందని అన్నారు. గర్భిణిగా ఉన్న సమయంలో మంచి పౌష్టిహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బూర బీన, కింతలి మన్మదరావు, లావేటి రమేష్ కురిటి అప్పారావు, పి సూరిబాబు, జనసేన నాయకులు అలబాన అప్పలరాజు, దుక్కరాజులతో పాటు సూపర్‌వైజర్ కె ఉమ, ఎంఎస్‌కె జ్యోత్స్న, కొర్నాన లక్ష్మీ, కె శ్యామలాదేవి, హిమబిందు, జి రాజేశ్వరి, సీహెచ్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు గోడౌన్ కార్మికులు తొలగింపు

విశాలాంధ్ర-కొత్తూరు: మండలం వసప వద్ద గల సివిల్ సప్లైస్ గోడౌన్ లో గత కొంత కాలంగా పనిచేస్తున్న కార్మికులు కే.వెంకటరమణ ,పి.శంకర్ వి.సురేష్ లు, స్వీపర్స్ అప్పమ్మ, రుక్మినమ్మ, లచ్చమ్మ లను యాజమాన్యం తొలగించింది. ఎలాంటి కారణం చూపకుండా మమ్మల్ని తొలగించడం అన్యాయమంటూ వీరు గేటు బయట ప్లె కార్డులు పట్టుకొని నిరసనలు తెలిపారు కాగా .ఏళ్ల తరబడి తక్కువ వేతనమైనా ఇదే బ్రతుక తెరువు గా పనులు చేస్తున్నాం తిరిగి తమను పనులోక్కి తీసుకోవాలని కోరుతూ గోడౌన్ మేనేజర్ కు తిలిగుంప బడిన కార్మికులు వినతి పత్రం ఇచ్చారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు గొంటి మురళీధర్

విశాలాంధ్ర-ఆమదాలవలస: యువత మద్యం మాదకద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుం టున్నారని, వ్యసనాలకు దూరంగా యువత విద్యాభివృద్ధి, ఉపాధి కోసం కృషిచేసి సమాజాభివృద్ధికి తోడ్పడాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు గొంటి మురళీధర్ పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక శ్రీకా కుళం జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధన రావు, జిల్లా నాయకులు కుర్మాన షణ్ముఖ రావులతో మురళీధర్ ఆమదాలవలస మండలంలోని అక్కుల పేట బూర్జ మండలంలోని తోట వాడ, ఓవిపేట, ఉప్పిని వలస ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయు లని ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. మూఢనమ్మకాల కారణంగా దేశవ్యా ప్తంగా అనేకమంది ప్రజలు అత్రస్ బాబా తొక్కిసలాట లాంటి దుర్ఘటనలతో దుర్మరణం పాలవడం, అనేకమంది మోసపోవడం జరు గుతున్నదని ప్రజలు మూఢనమ్మ కాలకు దూరంగా ఉండాలని కోరా రు. జన విజ్ఞాన వేదిక శాస్త్రీయ దృక్పథ ప్రచారం లో ఉపాధ్యా యులు విద్యావంతులు భాగస్వా మ్యం కావాలని పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దన్ రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటా ల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని తెలిపారు. కుర్మాన షణ్ముఖరావు మాట్లాడుతూ హానికర ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడు కోవాలని కోరారు.కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఘర్షణపై ఉపవిద్యాశాఖాధికారిణి విచారణ

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-పొందూరు: మండలకేంద్రంలో ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో వారంరోజులక్రితం జరిగిన విద్యార్థుల మధ్య ఘర్షణపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు జిల్లా ఉప విద్యాశాఖాధికారిణి విజయలక్ష్మి పాఠశాలలో సోమవారం విచారణ చేపట్టారు. విద్యార్థుల మధ్య ఘర్షణల్లో ధనుంజయ్ అనే విద్యార్థి చేయి విరిగింది. ఈ సంఘటనపై పత్రికలలో వచ్చిన కథనాలకు స్పందించిన అధికారులు విచారణకు ఆదేశించారు. ఈ ప్రేరకపాఠశాల లో విద్యార్థులు. వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయులను విచారించారు. విద్యార్థుల మధ్య ఎందుకు ఘర్షణ జరిగింది, దీనిపై హెచ్ఎం తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. హెచ్ఎం పి. వెంకటరావు స్పందించకపోవడంపై డీవైఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎం స్పందనపై చేయి విరిగిన విద్యార్థి తల్లితండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. హెచ్ఎం సెలవుపైనా ఆమె స్పందించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపధ్యంలో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎవరికీ సెలవులు మంజూరు చేయడంలేదని, హెచ్ఎం సెలవు ధరఖాస్తును ఆమోదించలేదని. దీనికారణంగా హెచ్ఎం పాఠశాలకు గైర్హాజరైనట్లు మాత్రమే గుర్తించడం జరుగుతుందన్నారు.

ఫార్మా కంపెనీల కాలుష్యపు నీరు సముద్రం పాలు

మత్స్యవేటకు అవకాశం లేక నష్టపోతున్న మత్స్యకారులు

- ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

విశాలాంధ్ర-రణస్థలం: మండలం మెంటాడలో ఒక ప్రయివేట్ కార్యక్రమంలో హాజరైన ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు దృష్టికి ఆ గ్రామ ప్రజలు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను తీసుకునివచ్చారు. దానిలో భాగం గా మెంటాడ రేవులో స్థానిక పరిశ్రమల నుండి వెలువడుతున్న కాలుష్యపు నీరు సముద్రంలో చేరుతున్న దృశ్యాల్ని ప్రత్యక్షంగా చూపించి, తద్వారా జరుగుతున్న నష్టాన్ని వివరించారు. దీని కారణంగా చేపల వేట జరపలేక జీవనాధారానికి ఇబ్బంది కలుగుతుందని తమ ఆవేదన వ్యక్తం చేసారు. ఈ విషయమై స్పందించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పరిశ్రమల యాజమాన్యం తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అలాగే బూటుపేట నుండి మెంటాడ, మెంటాడ నుండి బీచ్ వరకు సీసీ రోడ్ మరియు గ్రావెల్ రోడ్ నిర్మాణం జరిపించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలన్నీ పరిష్కారం అయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో విష్వక్సేన్, సీరపు పైడియ్య రెడ్డి, పీసిని జగన్నాధ నాయుడు, కొర్లయ్య, రాముడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్ ను కలిసిన పలువురు అధికారులు

విశాలాంధ్ర-కవిటి: మండలంలో గల ఎమ్మెల్యే అశోక్ క్యాంప్ కార్యాలయం రామయ్యపుట్టుగలో పలువురు అధికారులు కలిసి ఎమ్మెల్యే బెందాళం అశోక్ ను అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం ఇచ్ఛాపురం తహసిల్దార్ వెంకటేష్, సోంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ మంగరాజు ఎమ్మెల్యే బెందాళం అశోక్ ను పుష్పగుచ్చం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

అరసవల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా ...

అరసవల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర- శ్రీకాకుళం రూరల్: అరసవల్లిని అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని అరసవల్లి ప్రాంతంలో సోమవారం ఆయన కమిషనర్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే శంకర్ ను ఆహ్వానించి మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం ఉన్న అరసవల్లి గ్రామంలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేని స్థితిలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని శంకర్ పేర్కొన్నారు. అరసవల్లి పరిధిలో అనేక సమస్యలు గుర్తించామని చెప్పారు. కనీసం మౌలిక సదుపాయాలు కల్పనలో కూడా గత వైసిపి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రజలకు సరైన రోడ్లు, కాలువలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి తెచ్చారని వివరించారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గత వైసిపి ప్రభుత్వం అరసవల్లి లోని సమస్యలను ఏనాడూ కన్నెత్తి కూడా చూడలేదని పేర్కొన్నారు. తన విజయం కోసం సహకరించిన అరసవల్లి ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కమిషనర్ చల్లా ఓబులేషు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అరసవిల్లి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర-మందస: గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్టు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. సోమవారం మందస మండలం, బలియాసాయి గిరిజన గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే శిరీష శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గత వైసీపీ పాలనలో గిరిజన ప్రాంతాలు పూర్తిగా నిరాదరణకు గురయ్యాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన రోడ్లకు కనీసం వైసీపీ ప్రభుత్వం కనీసం మరమ్మత్తులు కూడా చేయలేదని ఎద్దేవా చేశారు. గిరిజనుల అభ్యున్నతికి వినియోగించాల్సిన సబ్ ప్లాన్ నిధులను జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో గిరిజనుల జీవితాల్లో వెలుగులు వస్తాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భావన దుర్యోధన, దాసరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ల వర్గీకరణకు. సుప్రీంతీర్పు పై నిరసనలు

పునః సమీక్ష జరపాలి : దళిత మహాసభ

విశాలాంధ్ర-కొత్తూరు: ఏస్.సి రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ను పునహసమీక్ష జరపాలని కొత్తూరు దళిత మహా సభ కోరుతుంది. కొత్తూరు మండల కేంద్రంలో దళిత మహాసభ అధ్యక్షులు తొంపల తిరుపతి రావు గారు కన్వీనర్ పడాల నాగభూషణం గారు కొసాధికారి రామకృష్ణ భహుజన సమాజ పార్టీ నాయకులు బొడ్డేపల్లి కృష్ణ ఉపాధ్యక్షులు శ్రీను ,దళిత మహిళా నాయకురాలు త్రినాధమ్మ మొదలగు వారు కొత్తూరు అంబేద్కర్ కూడలిలో మానవహారం నిర్వహిం చారు సుప్రీంకోర్టు నిర్ణయాన్ని . రాలీగా ఎం ఆర్ ఒ ఆఫీసు వరకూ వెళ్ళి తహసీల్దార్ కు దళిత మహాసభ నాయకులు. వినతిపత్రం అందజేశారు.

జాతీయ స్థాయి పోటీలకు రామ్మోహన్ రావు ఎంపిక

- జోన్1 లో 100,1000 మీటర్లలో ద్వితీయ స్థానం

- రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం

విశాలాంధ్ర-పలాస: పలాస ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న గురుగుబెల్లి రామ్మోహన్ రావు అఖిల భారత ప్రజా రవాణా సంస్థ (ఎఎస్ఆర్ టియు) ఆధ్వర్యంలో ఆల్ ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ లో 1000 మీటర్లు ఫాస్ట్ వాక్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. విశాఖపట్నం కైలాస గిరి క్రీడా మైదానం లో జూలై 14న విజయనగరం జోన్1 లో 100 మీటర్లు, 1000 మీటర్లు ఫాస్ట్ వాక్ లో పోటి చేయగా జోన్ స్థాయిలో రెండు విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించారు. అనంతరం ఆగష్టు 3న గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానంలో (50 ఏళ్ళు) పైబడిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో (నెల్లూరు, కడప, విజయనగరం జోన్లు) ఆయన 1000 మీటర్లు ఫాస్ట్ వాక్ లో పాల్గొని రెండో స్థానంలో నిలిచారు. దీంతో సెప్టెంబర్ లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఆయన రాష్ట్ర స్థాయిలో ఫాస్ట్ వాక్ లో రెండో స్థానం సాధించడం పట్ల పలాస ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్ సీతారాం నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ పినకాన సంతో కుమార్, పలు ఆర్టీసీ యూనియన్ నాయకులు అభినందించారు.

జీవో 77 ను రద్దు చేయాలి

విశాలాంధ్ర-టెక్కలి: జీవో నెంబర్ 77 ను వెంటనే రద్దు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సభ్యులు సోమవారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎబివిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొన్ని మురళి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి కేజీ టు పీజీ ఉచిత విద్య అని చెప్పి పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకుండా జీవో నెంబర్ 77 అమలు చేసి పీజీ విద్యార్థులను మోసం చేశారని అన్నారు. 2024 లో జరిగిన యువగళం పాదయాత్రలో నారా లోకేష్ జీవో నెంబర్ 77 ను రద్దు చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు అయినా సరే ఇప్పటికీ రద్దు చేయలేదు అన్నారు. వెంటనే రద్దు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సభ్యులు టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో నిరసన చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం టెక్కలి ఆర్డీవో కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎస్ ఎఫ్ డి జిల్లా కన్వీనర్ సిగిలిపల్లి మదన్ కుమార్, టెక్కలి ఏబీవీపీ కన్వీనర్ అభినవు విశ్వనాథ్, కిషోర్ కుమార్ మొదలగు ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్స్‌కు పురస్కారాలు



విశాలాంధ్ర-కొత్తూరు : కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల. లో ఇంటర్ లో టాపర్స్ గా మంచి మార్కులు సాదిం చిన టాపర్స్ కు పాతపట్నం కు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అభినందించింది. ట్రస్ట్ అధ్యక్షులు ,జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు గారి ఆధ్వర్యంలో 2023 ు24 విద్యాసంవత్సరంలో, కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, రామరాజు అభినందన పురస్కారంతో పాటు నగదు పురస్కారం జ్ఞాపికలును. పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు గారు చేతులమీదుగా ప్రదానం చేయడమైనది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్. విద్యావేత్త, వై. గోపాల్ దాన్ నాయుడు వైస్ ఎంపిపి, లోతుగెడ్డ. తులసి వరప్రసాద్ రావు ,టీడీపీ నాయకులు ఎల్.తాతబాబు మాతల గాంధీ, ఏ. మాధవరావు, ఏ.అరుణ్ కుమార్, బి.రాంబాబు పాల్గొన్నారు.

కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర-నరసన్నపేట: దేశ రాజధాని ఢిల్లీలోని కేంద్ర రైల్వే శాఖ మంత్రి, అశ్విన్ వైష్ణవ్‌ను సోమవారం ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి, కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి, నియోజకవర్గంలోని తిలారు రైల్వే స్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి, అశ్విన్ వైష్ణవ్‌ను కోరారు.

నేడు ఆలయాల హుండీల లెక్కింపు

విశాలాంధ్ర-టెక్కలి: మండల పరిధిలో ఉన్న రావివలస గ్రామంలో దేవాదాయశాఖ పరిధిలో ఉన్న శ్రీ ఎండల మల్లికార్జున స్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం 10 గంటలకు స్వామివారి హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించనునట్లు ఆలయ ఈవో రాధాకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా స్థానిక సంతోష మాత ఆలయ హుండీ లెక్కింపు కూడా మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో టిపి మనస్వి తెలిపారు.

ఇత్తడి కవచం వితరణ

విశాలాంధ్ర - జలుమూరు : ప్రముఖ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పిలవబడుతున్న జలుమూరు మండలం శ్రీముఖలింగం గ్రామంలో కొలువైవున్న శ్రీ మధుకేశ్వర స్వామి మూలవిరాట్ వెనుక భాగంలో ఉన్న గోలేమును విజయనగర గ్రామానికి చెందిన ఎడ్ల పైడిరాజు శ్రావణమాసం సోమవారం గోలేంకు ఇత్తడి కవచాన్ని బహుకరించారు. గోలేంనిండిన వరకు బియ్యంతో అభిషేకాన్ని చేపట్టారు. ఆయన మొక్కులను చెల్లించుకుని అర్చకుల ఆశీర్వచనాలు చేసి, అర్చకులు శేష వస్త్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ పాలక మండల చైర్మన్ భైరి బలరాం మాజీ సర్పంచ్ బసవ యోగేశ్వర రావు ప్రధాన అర్చకులు శేషాద్రి వెంకటాచలం పలువురు ఆరక్షకులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఎస్‌జిఎఫ్ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని డి.గోనపపుట్టుగ పంచాయతీ లోగల వడ్డీ జల్లుపుట్టుగ గ్రామానికి చెందిన గణపతి మజ్జి గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయాన్ని తెలుసుకున్న ఎస్ జి ఎఫ్ సభ్యులు తక్షణ సహాయంగా సంస్థ సహాయ నిధి నుంచి 10 వేలు రూపాయలు విరాళంగా గణపతి మజ్జికి గ్రామ పెద్దలు పండి దేవేంద్ర మూర్తి చేతుల మీదుగా అందజేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి గణపతికి ఆర్థిక సహాయాన్ని అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోహన్ సాహు, ఎస్ జి ఎఫ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల వర్తింపునకు ఈ-పంట నమోదు

విశాలాంధ్ర - సోంపేట : ప్రభుత్వం ద్వారా పథకాలు రైతులకు వర్తించాలంటే ఖచ్చితంగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని శ్రీకాకుళం వ్యవసాయ వనరుల కేంద్రం ఉపసంచాలకులుకె.త్రినాధస్వామి పేర్కొన్నారు. సోంపేట సోమవారం సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాఖ సహాయకులతో దీనిపై సమావేశం నిర్వహించారు. సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో త్రినాధస్వామి మాట్లాడుతూ వ్యవసాయ సహాయకులు ప్రస్తుత ఖరీఫ్‌లో రైతుల పంటల వివరాలను తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. సర్వే నెంబరు వారీగా సాగునీటి సదుపాయం, పంట సాగురకం, సాగు విస్తీర్ణం, యజమాని వివరాలు కౌలుదారుల వివరాలను నమోదు చేయాలని కోరారు. తద్వారా రైతులు లేక కౌలుదారులకు సబ్సిడీ ఎరువుల సరఫరా, సబ్సిడీ విత్తనాలు, పంట నష్టపరిహారం, పంట కొనుగోళ్లు తదితర అన్ని సదుపాయాలు ఉంటాయని సూచించారు. ఈ విధంగా సర్వే చేసిన రైతులకు ధృవీకరణ పత్రాలు కూడా అందజేయాలని సూచించారు. ఖరీఫ్‌సాగులో సంద్రీయ సాగుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధరలు దక్కేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు బి.నర్సింహమూర్తి, కె.తిలక్, టి.భార్గవి, ఆర్ట్ సీఈఓ ప్రియాంక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అబ్బురపర్చిన గణిత దశావధానం

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలాసకు చెందిన జనజాగృతి సాహితి సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో డాక్టర్ కుమార్‌నాయక్ అధ్యతన సోమవారం ప్రముఖ గణిత దశావధాని మడ్డు తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత దశావధానం అందరినీ అలరించింది. ప్రేక్షకులను ఔరా అనిపించింది. దశావధానంలో పది మంది విద్యార్థులు పృచ్ఛకులుగా వ్యవహరించి గణితంలో దశావధానికి ప్రశ్నించిన అనేక తికమక ప్రశ్నలకు సైతం అవధాని అవలీలగా చెప్పిన సమాధానాలు అందరినీ అబ్బురపరిచాయి. కూడికలు, తీసివేతలు, గుణిజాలు, భాగహారాలతో సామాన్య విశేషాలను పక్కన పెట్టి అత్యంత క్లిష్టమైన ఎన్నో గణిత అంశాలకు అందరూ అవాక్కయ్యేలా దశావధాని మడ్డు తిరుపతిరావు చటుక్కున చెప్పిన సమాధానాలు అందరినీ సంబరమాచ్చర్యాలకు గురి చేశాయి. ఈ కార్యక్రమం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, సాహితి సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థులు ఎంతగానో ఆనందించారు. ఈ కార్యక్రమం వలన గణితంలో ఎన్నో ఆశ్చర్యకరమైన అంశాలను నేర్చుకున్నామని సంబరపడ్డారు. కార్యక్రమంలో శ్రీనివాస్ బాబ్జి, పాఠశాల హెచ్‌ఎం ఆర్.అనంతరావు, డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, బి.బాలకృష్ణవర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీనియర్ టీడీపీ నాయకులు 'చింతు' మృతి



విశాలాంధ్ర - నరసన్నపేట : సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, మేస్త్రి, చింతు భాస్కర రావు(75) సోమవారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనా రోగ్యంతో సతమతమవుతున్న భాస్కరరావు మృతి చెందటంతో పట్టణంలోని టిడిపి వర్గీయులు, ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి, శ్రీకాకుళం ఎంపి, కేంద్ర, పౌర విమానయాన శాఖ మంత్రి, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ధిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుడు భాస్కరరావుకు భార్య, జయలక్ష్మీ, పిల్లలు వున్నారు. అలాగే శ్రీ సంతోషిమాత భవన నిర్మాణ కార్మికుల సంఘం ప్రతినిధులు, తర్ల లక్ష్మణరావు, తంగి వెంకటరావు, వాన అప్పారావు, బోర వెంకటరమణ, బగ్గు గురుమూర్తి, రాజాపు తవుడు, అక్కునాయుడు తదితరులు మృతుడు, భాస్కరరావు కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియచేశారు.

అనారోగ్యంతో శ్రీనందం సుబ్బారావు స్వామి మృతి

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆమదాలవలస మండలంలో గాజులకొల్లివలస గ్రామం సమీపం లో అతి ప్రాచీనమైన సంగమేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో గత 43 సంవత్సరాలుగా భక్తులకు సాధకులకు ఆధ్యాత్మిక మార్గం లో దిశా నిర్దేశం చేసి అందరి మన్ననలు పొందిన సుబ్బారావు స్వామిజీ (84) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయన 1981లో సంగమేశ్వర కొండ పై ఒక చిన్న కుటీరం నిర్మిం చుకుని దేవుని ఆదేశం మేరకు అక్కడకు చేరారు. ఆయన జీవన శైలిని గమనించిన కొంత మంది శిష్య బృందం వారికి కొండ దిగు వన సకల సదుపాయాలతో ఒక శాశ్వత భవనాన్ని నిర్మించారు. 2005 నుండి ఆయన అక్కడే నివాసం అంటూ పరిసర ప్రాంతా లలో భక్తుల కోరిక మేరకు వారి ఇళ్లకు వెళ్లి వారు పెట్టిన ఆహారాన్ని స్వీకరించి తిరిగి తన ఆశ్రమానికి వచ్చేవారు. ముఖ్యంగా ఆయన ఎవరి నుంచి ఏది ఆశించేవారు కాదు. ఆ భక్తులు పెట్టిన ఒక్క పూ ట ఆహారం మాత్రమే తినేవారు. తూర్పు గోదావరి జిల్లా రావుల పాలెం స్వామీజీ స్వస్థలం. ఆయ న అవివాహితుడు. కానీ ఈ పరిసర ప్రాంతాలలో కొన్ని వందల మంది శిష్య బృందం ఆయనను కుటుంబ సభ్యులుగా భావించేవారు. ఆయన అంత్యక్రియలు సంగమేశ్వర ప్రాంతంలో నిర్వ హించారు.

తల్లిపాలే బిడ్డకు అన్ని విధాల శ్రేయస్కరం

విశాలాంధ్ర - కవిటి : తల్లిపాలే బిడ్డలకు అన్ని విధాల శ్రేయస్కరమని మాజీ జడ్పిటిసి సభ్యుడు బెందాళం రమేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలో గల కవిటి, బట్టివానిపాలెం, దూగాన పుట్టుగ, రాజాపురం1, 2, కళింగపట్నం అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాలు నిర్వ హించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తల్లిపాలులో రోగనిరోధక శక్తి ఉంటుందని అందువల్ల బాలింత లకు క్రమం తప్పకుండా పిల్లలకు పాలు ఇవ్వాలని అన్నారు.అంతేకాకుండా తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు బాలింతలు నిత్యం ఆకుకూరలు పాలు వంటివి వాడాలని అన్నారు. తల్లిపాలుతోనే బిడ్డలకు ఆరోగ్యమని అపోహాలు వీడి బాలింతలు పిల్లలకు పాలు పెట్టాలని అన్నారు. తల్లిపాలు ద్వారానే శిశువు త్వరగా ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బెందాళం తిరుమల, ఆరంగి మధు, వజ్జ రంగారావు, ఏ త్రివిక్రమరావు, అంగన్వాడి సూపర్వైజర్లు, లక్ష్మి, కృష్ణవేణి, అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 10న శ్రీ షిర్డీసాయి 16వ వార్షికోత్సవం

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక కలివరపుపేట వీధి సమీపంలో వున్న సాయినగర్‌లో ఈనెల 10వ తేదీన శ్రీ షిర్డీసాయి ధ్యాన మందిరం 16వ వార్షికోత్సవం నిర్వహించబడునని మందిర కమిటీ తెలిపారు. సోమవారం మందిర కమిటీ సభ్యులు, వైశ్యరాజు సత్యానందరాజు, తంగుడు షణ్ముఖరావు, పొట్నూరు నీలం మాట్లాడుతూ 10వ తేదీ శనివారం ఉదయం కాకడ హారతి, సాయినాధునికి పాలు. పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించబడునని అన్నారు. అలాగే మధ్యాహ్నం 12గంటలకు అన్నసమారాధన, సాయంత్రం 6గంటలకు సంధ్యా హారతి, సాయి భక్తి గీతాలు, రాత్రి 8గంటలకు శేజ్ హారతి, అనంతరం భక్తులు ఆధ్వర్యంలో భజనలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి సేవలు నిరుపమానం

361ఎ డిస్ట్రిక్ గవర్నర్ ఎన్‌వీబీఎస్ ఎస్ ప్రసాద్

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి సేవలు నిరుపమానమని, నిరాశ్ర యులు, నిరుపేదల అభ్యున్నతికి వారు అందిస్తున్న సేవలు ఎంతో సంతృప్తినిస్తున్నాయని 361ఎ డిస్ట్రిక్ గవర్నర్ ఎన్‌వీబీఎస్ ఎస్ ప్రసాద్ అన్నారు. డాన్ టు డస్క్ కార్య క్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లాకు వచ్చిన గవర్నర్లు నగరంలోని శాంతినగర్ కాలనీలోని స్విమ్మింగ్ ఫూల్ ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం నరసన్నపేటకు చెందిన పదిమంది అంధులు నిత్యావసర కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా అంధులు పాడిన పాటలకు ముగ్దులై వారికి నగదు సహాయాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత రెండు నెలలుగా లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి చేపడుతున్న సేవలు నిరుపమానమని తెలిపారు. పేద విద్యార్థుల చదువు ఆర్థిక సహాయం అందజేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనాలు అందజేయడం, డాక్టర్ డే కార్య క్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని గవర్నర్లు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హారికా ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యంలో ఐదువేల మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు వివరించారు. మొక్కలు నాటడమే కాదు వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక చర్యలు చేపడుతూ సంరక్షకులను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ కరణం శోభారాణి మాట్లాడుతూ శ్రీకాకుళం నగరాన్ని గ్రీన్‌సిటీ మార్చాలన్న లక్ష్యంతో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ -1 సూర్యప్రకాశరావు, మాజీ వైస్ ఛాన్సలర్ ఎస్ ఆర్‌కె రామకృష్ణారావు, ఆర్ రంగనాథం, లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి అధ్యక్షులు వావిలాపల్లి జగన్నాథం నాయుడు, ఉపాధ్యక్షులు తర్లాడ అప్పలనాయుడు, కార్యదర్శి మణిశర్మ, ట్రెజరర్లు ఎస్ లక్ష్మీపతి, కె లక్ష్మీకాంత్, మజ్జి సుమన్, లక్ష్మణ్, నిహార్‌నాయుడు, జీఎన్‌టీ నాయుడు, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - టెక్కలి : మానసిక వికలాంగులు కోసం రూపొందించబడిన పథకాలపై వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులు అవగాహన కలిగి వుండాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్ హెచ్ ఆర్ తేజ చక్రవర్తి మల్ల అన్నారు. ఈ సందర్భంగా సోమవారం టెక్కలిలోని సహిత భవిత విద్యా కేంద్రంలో ఆయన మానసిక అనారోగ్యవంతులు, మానసిక వికలాంగులు యొక్క తల్లి దండ్రులు, సంరక్షకులుతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ సాధారణ పౌరులతో పాటు మానసిక వికలాంగులకు కూడా రాజ్యాంగం లో సమాన హక్కులు కలిపించబడ్డాయని అన్నారు. మానసిక అనారోగ్యవంతుల ను, మానసిక వికలాంగుల ను మానసిక వైద్యశాలలు లో కాని లేదా మానసిక వృద్ధాశ్రమాలు లో చేర్పించి వారికి సరైన వైద్యం అందించాలని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థలు అందిస్తున్న సేవలు పై అవగాహన కలిగించారు. ఈ సదస్సు లో టెక్కలి కోర్టు న్యాయవాదుల సంఘము అధ్యక్షులు డివి వివేకానంద, టెక్కలి ఎంఈఓ-1 డి తులసీరావు, ఎంఈఓ- 2 డి చిన్నారావు, సహిత భవిత విద్యా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

తాళబద్రలో తల్లిపాలు వారోత్సవాలు

విశాలాంధ్ర - పలాస : కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి తాళభద్రలో సోమవారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వ హించారు. తాళబద్ర, జయ రామచంద్ర పురం, పెంటి భద్ర, తాళబద్ర-2 అంగన్వాడి కేంద్రాల పరిధి కార్యకర్తలచే తల్లిపాలు ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలకు సీమంతాలు నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకత గురించి వివ రించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడి సిబ్బంది ఎస్.శైలజ, కృష్ణవేణి, ఎస్.శాంతి, రమ పాల్గొన్నారు.

గొర్లె కుటుంబానికి తిలక్ పరామర్శ

విశాలాంధ్ర - పలాస : పలాస మండల వ్యవసాయ బోర్డు మాజీ చైర్మన్ శ్రీ గొర్ల.వేణు మాతృమూర్తి గొర్లె పద్మావతి ఇటీవల మృతి చెందడంతో సోమవారం వేణు కుటుంబాన్ని వైసిపి పార్లమెంటరీ ఇంచార్జ్ పేడాడ తిలక్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈయన వెంట నందిగాం ఎంపీపీ నడిపూరి. శ్రీరామ మూర్తి, పలాస పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ. మాధవరావు,నందిగామ మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని.జోగారావు, కవిటి అగ్రహారం సర్పంచ్ ప్రతినిధి శ్రీ బొమ్మాలి బున్నయ్యలు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో రేషన్ సహాయకుడు మృతి

విశాలాంధ్ర - మందస : చీపి పంచాయతీ రాజపురం గ్రామంలో ఈ నెల రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో విద్యుత్ శాఖ గురై మండలం సాబకోట పంచాయితీ భావనా పురంకు చెందిన గిరిజన యువకుడు సవర కామేష్ మృతి చెందాడు. కాటా మిషన్ చార్జింగ్ పెడుతున్న సమయంలో కరెంటు ఎర్త్ అయి షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై మంగస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వితంతు పింఛన్లకై అవగాహన

విశాలాంధ్ర - పలాస : రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ మరియు ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ ఆధారిటీ చైర్మన్ ఆదేశాల మేరకు సోమవారం పలాస మండల లీగల్ సర్వీస్ ఆధారిటీ చైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి ఆధ్వర్యంలో పలాస మండల పరిషత్ కార్యాలయం లో పలాస, వజ్రపుకొత్తూరు ఎంపీడీఓ లు మెట్ట వైకుంఠరావు, డి.తిరుమల అధ్యక్షతన పలాస, వజ్రపుకొత్తూరు గల మహిళలకు వితంతు పెన్షన్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాధురి మాట్లాడుతూ అర్హత ఉండి వితంతు పెన్షన్ అందని వాళ్ళు మరల దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జీఎంస్ అనిల్ రాజు, సీనియర్ న్యాయవాదులు బీకే ఆర్ పట్నాయక్, కోత రజనికుమార్, జి.ప్రభాకర్, చిట్టిబాబు, కె. దేవరాజు ఉషారాణి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు

ఈనెల 15న శ్రీ రమా సత్యన్నారాయణ స్వామి వ్రతములు

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని రావులవలస పంచాయితీ గుండివిల్లిపేట గ్రామంలో శ్రీ సర్వమంగళ కళ్యాణ మండపం 3వ వార్షికోత్సవం సంధర్భంగా ఈనెల 15వ తేదీన శ్రీ రమా సత్యన్నారాయణ స్వామివారి వ్రతములు సామూహికంగా నిర్వహించబడునని పంచిరెడ్డి విశ్వనాధం-పద్మజ దంపతులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ గురువారం ఉదయం 8గంటలకు వ్రతములు శ్రీ సర్వమంగళ కళ్యాణ మండపంలో నిర్వహిం చబడునని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ధర్మాన రామదాస్, కింజరాపు అమ్మన్నాయుడు, పంచిరెడ్డి సత్యన్నారాయణ, పల్లి సింహాచలం హాజరవుతారని తెలిపారు. వ్రతములో పాల్గొనే దంపతులకు అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేస్తున్నామని, ఈ సామూహిక వ్రతాల్లో ప్రతీ ఒక్కరూ పాల్గొని, స్వామివారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

విశ్రాంత ఉపాధ్యాయులు ఏకాంబరరావు

విశాలాంధ్ర - కవిటి : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత నెలకొంటుందని విశ్రాంత ఉపాధ్యాయుడు కరగాన ఏకాంబరావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలో గల కపాసుకుద్ది గ్రామంలో వెలసివున్న శ్రీ రామలింగేశ్వర ఆలయంలో సంగీత, జానపద కళాకారుడు తిప్పన ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో రుద్రాభిషేకం, అష్టోత్తర పూజ, అన్నదాన కార్యక్రమాలు తోపాటు కళాకారుల సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉద్యానవన కళాకారుల తోపాటు ఒరిస్సా కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళా తపస్వి సి హెచ్ కపాసుకుద్ది గ్రామానికి చెందిన సీనియర్ కళాకారులు చలపరాయి ఏకాంబరం, డి గొనపపుట్టుగ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు ఆధ్యాత్మికవేత్త కరగాన ఏకాంబర రావు మాస్టారు కు ఘనంగా సత్కరించారు. అలాగే సీనియర్ కళాకారులు గొనప లక్ష్మణ్ మూర్తి, ఎరుక నాయుడు, మోహన్ రావు మాస్టర్, మార్పు నారాయణ రావు, నర్తు రంగయ్య, పైల రాజా రెడ్డి, కప్ప లోహిదాస్, కూర్మారావు, పరపటి మూర్తి, బోర రామారావు, శంకర్, నిరంజన్ దాస్, చక్ర పెరుమాళ్ళ స్వామివారి ఆలయ ధర్మకర్త పొందల కృష్ణారావు లకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలొ ముఖ్య అతిధులుగా ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప,ఎక్స్ ఎంపీపీ కారింగి మోహన్ రావు, టీ బరంపురం సర్పంచ్ కారింగి త్రినాధ్ రెడ్డి, రంగాల జానకిరావు, తనూజ, గ్రామస్తులు సర్పంచ్ ప్రతినిధి కాయ భీమసేన్, తోట ధర్మరాజు, రామారావు, చిట్టిబాబు, నాలుగు మండలాల కళాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వం నూతన ఉత్సాహాన్ని నింపింది

విశ్రాంత డిఎస్పి ఎస్‌వివి ప్రసాద్‌రావు

విశాలాంధ్ర - కవిటి : జనసేన పార్టీ సభ్యత్వం నాలో నూతన ఉత్సాహాన్ని నింపిందని విశ్రాంతి డిఎస్పి ఎస్‌వివి ప్రసాద్ రావు అన్నారు. ఈ మేరకు సోమవారం కవిటి మండలంలో గల జగతి గ్రామంలో జగతి గ్రామానికి చెందిన విశ్రాంత డి.ఎస్.పి,హైకోర్టు న్యాయవాది అయిన ఎస్ వి వి ప్రసాదరావు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను, జనసేనపార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ దాసరి రాజు నాయకత్వంలో జనసేనపార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు తిప్పన దుర్యోధన రెడ్డి, భైపల్లి ఈశ్వరరావు, మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరిబెహారా నాయకుల సమక్షంలో జనసేనపార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని తీసుకొన్నారు. విశ్రాంత డీఎస్పీ ఎస్ వి వి ప్రసాద్ రావు తో పాటు గ్రామంలో 200మంది సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఇన్చార్జ్ దాసరి రాజు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ వై నమ్మకంతో జనసేన పార్టీ సిద్ధాంతాలను మెచ్చి ఉన్నత పదవులు చేపట్టి ఎన్నో సేవలను అందించిన ప్రసాదరావు జనసేన పార్టీలో క్రియాశీల సభ్యత్వం తీసుకోవడం చాలా మంచి పరిణామం అని అన్నారు. విశ్రాంత డిఎస్పి ఎస్ వి వి ప్రసాద్ రావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ నాయకత్వంలో దాసరి రాజుతో కలిసి నీతి, నిజాయితీ, నిబద్ధత గల జనసేనపార్టీలో సభ్యుడుగా చేరడం చాలా సంతోషంగా ఉందని అందరితో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు దివాకర్, కుసుంపురం జనసేన సర్పంచ్ అభ్యర్థి సురేష్ కుమార్, జనసేన నాయకులు ధనుంజయం, రఘు, నేతాజీ, సాగర్, వీరమహిళ శైలజ, జనసైనికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కొని మంచి జీవితంలో స్థిర పడండి : ఎమ్మెల్యే గోవిందరావు

విశాలాంధ్ర - హిరమండలం : విద్యార్థులంతా చక్కగా చదువు కొని మంచి జీవితం లో స్థిర పడాలని ఉన్నత ఉద్యోగాల్లో స్థిర పడి కన్న తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పాతపట్నం నియోజకవర్గ శాసన శాసన సభ్యులు మామిడి గోవిందరావు పిలుపు నిచ్చారు. సోమవారం హిర మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్ మీడియట్ ప్రథమ, ద్వితీయ సంత్సరం చదువు తున్న అన్ని గ్రూప్ ల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలను, నోట్స్ లను ఎమ్మెల్యే గోవిందా రావు చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మామిడి గోవింద రావు మాట్లాడుతూ బ్రతుకులను విద్యార్థి దశ లోనే బాగుచేసుకోవాలని, చెడు వ్యాసనాలకు బానిసలుకాకూడదని ఎంతో ఇబ్బందులు పడి మీ తల్లి దండ్రులు చదువుకు పంపిస్తున్నారని వారి ఆశలు ఓమ్ము కానివ్వకండి అని ఈ సందర్భంగా విద్యార్థులకు గుర్తు చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ ప్రతినిధి టి తిరుపతి రావు, జడ్పీటీసీ పి బుచ్చి బాబు, తహసీల్దార్ బి వెంకట్ రమణ, ఎంపీడీఓ స్వరూప రాణి, ఏంఈఓ కిలారి రాంబాబు, టీడీపీ కార్యకర్త పి శ్రీధర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి 55000 ఆర్థిక సాయం



విశాలాంధ్ర - టెక్కలి : గార మండలం నిజాంబాద్ గ్రామానికి చెందిన దుమ్ము లక్ష్మీనారాయణ సాయమ్మ దంపతులకు మూడేళ్ల కారుణ్య అనే పాప గలదు. ఇటీవల పాప ఆరోగ్యం క్షీణించడం తో హాస్పిటల్ తీసుకు వెళ్ళగా అన్ని పరీక్షలు జరిపి పాపకు బ్లడ్ కేన్సర్ అని గుండె పగిలే వార్త ఆ తల్లిదండ్రులకు తెలియజేశారు. ప్రస్తుతం పాప వైజాగ్ మెడికవర్ ఆస్పత్రి లో చికిత్స పొందుతుంది. వీళ్ళది చాలా నిరుపేద కుటుంబం మందుల ఖర్చు కి కూడా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న టెక్కలి అభయం యువజన సేవా సంఘం వాళ్లు వెంటనే స్పందించి పలువురి దాతల ద్వారా సేకరించిన 55000 రూపాయలు చిన్నారి వైద్యం కొరకు సోమవారం కారుణ్య మేనమామ శివ కు అందించినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాస రావు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల చిన్నారి ఆపదలో ఉందని తెలుసుకున్న వెంటనే స్పందించిన ప్రతి ఒక్క దాతకు మా అభయం సేవా సంఘం తరఫున ధన్యవాదాలు తెలుపుకున్నారు. ఆ దేవుని దయతో చిన్నారి వేగంగా కోలుకోవాలని సభ్యులందరం ఆశిస్తున్నామని అన్నారు. మా అభయం సేవా సంఘం సేవలు అనేవి ఇలా జిల్లా నలుమూలలు వ్యాపించడం చాలా ఆనందంగా ఉందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభయం యువజన సేవా సంఘ అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు, సెక్రెటరీ లాడి కామేశ్వరరావు, ట్రెజరర్ శ్రీనివాస్ బెహరా, తిరుమల ఫ్యామిలీ మాల్ అధినేత అందవరపు కిషోర్ మరియు సంఘ సభ్యులు యన్ సింహాచలం, డి పూర్ణాచారీ, మున్నా, యస్ రాజేష్, అద్దాలు వీరబద్రాచారి, యు గోవిందరావు, ఎస్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

2400 హెక్టర్లలో సూక్ష్మ నీటిపారుదల పథకం అమలు లక్ష్యం

పథక సంచాలకులు శ్రీనివాసరావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : శ్రీకాకుళం జిల్లాలో 2024-25 లో 2,400 హెక్టర్లలో ఉద్యాన మరియు వ్యవసాయ పంటలకు సూక్ష్మ నీటిపారుదల పథకం అమలు చేయాలని లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పెట్టుకున్నామని జిల్లా సూక్ష్మ నీటిపారుదల పథకం అధికారి ఆర్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.11.17 కోట్లు రైతులకు రాయితీగా అందిస్తామని వివరించారు. దీనిలో కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తాయని తెలిపారు. దీనివలన నీరు, విద్యుత్, ఎరువులు ఆదా అవుతాయని, కూలీల ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. కలుపు సమస్య తక్కువగా ఉంటుందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ పథకమున పండ్ల తోటలయిన కొబ్బరి, అయిల్ పామ్, జామ, మామిడి, జీడిమామిడి, మొక్కజొన్న, ప్రత్తి, మిరప, కూరగాయలు పంటలకు అందించబడుతుంది న్నారు. అదేవిధముగా స్ప్రింక్లర్లను, వ్యవసాయ పంటలయిన పెసర, మినుము, వేరుశనగ పంటలకు అందించబడుతుందని తెలిపారు. కావున అర్హులైన రైతులందరు నమోదు చేసుకొని ఈ స్కీములో ఉన్న రాయితీలను సద్వినయోగము చేసుకోవాలని కోరారు. బిందు సేద్యానికి (డ్రిప్) చిన్న మరియు సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడి పై రూ.2.18 లక్షలు వరకు, 5.00 ఎకరాలకు మించకుండా అందించబడుతుందని చెప్పారు. 5.00 నుండి 12.50 ఎకరాలు వరకు భూమి కలిగియున్న ఇతర రైతులకు రూ.3.10 లక్షలు వరకు 50 శాతం సబ్సిడి తో అందించబడుతుంది న్నారు. తుంపర్ల సేద్యానికి (స్ప్రింక్లర్) చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం సబ్సిడి 5.00 ఎకరాలకు మించకుండా అందించడం జరుగుతుందని తెలిపారు. 5.00 నుండి 12.50 ఎకరాలు వరకు భూమి కలిగి ఉన్న ఇతర రైతులకు 45 శాతం సబ్సిడితో అందించబడుతుందన్నారు. బిందు, తుంపర్ల సేద్యము పరికరాలు రాయితీపై పొందుటకు రైతులు ఆధారుకార్డు, భూమి యాజమాన్య పత్రము జతచేసి రైతుసేవా కేంద్రాలు, మండల ఉద్యాన అధికారి, సూక్ష్మ నీటిపారుదల అధికారి, జిల్లా మైక్రో ఇరిగేషన్ కార్యాలయల్లో బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. బోర్లు, బావుల క్రింద వ్యవసాయము చేసే రైలులకు ఇది మంచి అవకాశమని ఆయన చెప్పారు.

తల్లిపాలే బిడ్డకు బలవర్థకం : ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో ముఖ్యమని, బలవర్థకమని తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, రోగనిరోధక శక్తిని పెంచుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని బలగ సెక్టార్ భావాజీ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగో వార్డు ఇంచార్జ్ రెడ్డి సూర్యనారాయణ, రెడ్డి శంకర్ ల ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ బిడ్డకు పాలివ్వడం వలన తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అదేవిధంగా తల్లికి రొమ్ము క్యాన్సర్ లాంటివి రావని సూచించారు. శిశువుకు మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలే ఆహారంగా అందించాలని, ఎటువంటి ద్రవ పదార్థాలు అందించవద్దని సూచించారు. చిన్నారులకు డబ్బా, పాల ప్యాకెట్ల పాలు పట్టించొద్దని తెలిపారు. చిన్నారుల్లో తల్లిపాలతోనే వ్యాధి నిరోధకశక్తి లభిస్తుందని జీర్ణవ్యవస్థను మెరుగు పరిచి, ఎదుగుదలను పెంచుతుందని తెలిపారు. గర్భిణిగా ఉన్న సమయంలో మంచి పౌష్టిహారాన్ని తీసుకోవాలని చెప్పారు. మాతాశిశు మరణాలను తగ్గించేందుకే ప్రతీ ఏడాది ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బిడ్డకు పాలివ్వడం వలన తల్లికి కూడా లాభాలున్నాయన్నారు. ప్రసవంలో తల్లి బరువు ఎక్కువ పెరుగుతుందని పాలివ్వడం వలన బరువు తగ్గుతారని చెప్పారు. రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, రక్తపోటు, టైప్ 2 మధుమేహం వంటి రోగాలు భవిషత్తులో రాకుండా అడ్డుకుంటాయని వివరించారు. భవిష్యత్తులో బిడ్డలకు రోగాలు రాకుండా కాపాడటంలో తల్లి పాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో శోభారాణి, టీడీపీ నాయకులు చిట్టి నాగభూషణం, తంగి నర్సింగరావు, రెడ్డి ఆమని, సాదు కోటి, సాద్ పరమేశు, కోలా చిరంజీవి, సాదు అజయ్, తంగి గణేష్, రావాడ పురుషోత్తం, కెవిఎస్ నాయుడు, మురళి, సచివాలయం సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం పాల్గొన్నారు.